తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## శ్రీవారి సేవలో సిఎస్ నీరబ్‌కుమార్



తిరుమల, జూలై 14 ప్రభాతవార్త: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ దంపతులు ఆదివారం వేకువజామున శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి జెఈఓ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, వసతి కల్పన డిప్యూటీ ఈఓ పి.హరీంద్రనాథ్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

గంజాయి నిర్మూలనకు

## వంద రోజుల యాక్షన్ ప్లాన్

**త్వరలో యాంటి నార్కొటిక్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు**
**రాష్ట్ర డీజీపి ద్వారకా తిరుమలరావు**




కాణిపాకం, జూలై 14 ప్రభాతవార్త:
రాష్ట్రంలో గంజాయి పూర్తి స్థాయిలో నిర్మూలనకు వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను అమలు చేసి వంద రోజుల్లో ఈ సమస్యను ఒక కొలిక్కి తెస్తామని రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు అన్నారు. ఆదివారం ఆయన కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు అనుకున్నది నెరవేరాలి...ఎలాంటి ఆటంకాలు కలుగకుండా విఘ్నాలు తొలగిపోవాలని, శాంతి భద్రతల కాపాడే విషయంలో పోలీసు శాఖ చేసే కృషికి స్వామివారి సహకారం వుండాలని కాణిపాకం స్వామివారిని ప్రార్థించినట్లు రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు అన్నారు. తాను డీజీపిగా బాధ్యతలు చేపట్టిన రోజు నుండి రాష్ట్రంలో నేరపరిశోధన, శాంతి భద్రతలు, ఆలయాలకు భద్రత, ప్రజలకు భద్రత కల్పించే విషయంలో చర్యలు తీసుకునేందుకు ఎస్పీలతో సమీక్షించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు నూతన ఎస్పీలను నియమించడం జరిగిందని తెలిపారు. వారికందరికి దిశా నిర్దేశం చేసి సరైన పద్దతిలో చట్టాలను గౌరవిస్తూ ఇంతకు ముందు ఎప్పుడైనా చిన్న చిన్న పొరబాట్లు జరిగినా ఇకపై అలాంటివి జరుగకుండా చూడాలని, అలాగే ఇంతకు ముందు ఎక్కడైనా చర్యలు తీసుకోని కేసుల్లో చర్యలు తీసుకోవాలని, ప్రజలకు జవాబుదారితనంగా వుండాలని, సమాజానికి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు ఇవ్వాలని దిశా నిర్ధేశం చేసినట్లు తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడానికి ఇంతకు ముందు కూడా టాస్క్‌ఫోర్స్ పెట్టామని అయితే గత కొంత కాలంగా ఈఫోర్స్ స్థబ్దుగా వుందని దీన్ని మరింత బలోపేతం చేసి ఎర్రచందనం అక్రమరావాణాను అరికడతామని డీజీపి తెలిపారు. అలాగే రాష్ట్రంలో గంజాయి పూర్తి స్థాయిలో నిర్మూలనకు వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను అమలు చేసి వంద రోజుల్లో ఈ సమస్యను ఒక కొలిక్కి తీసుకురానున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరలో యాంటి నార్కొటిక్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిద్దినున్నట్లు తెలిపారు. అలాగే గంజాయి నిర్మూలనపై నిరంతరం చర్యలు వుంటాయని చెప్పారు. ఇదిలా వుండగా రాష్ట్రంలో ఏపార్టీ వారైనా ఎవరైనా సరే దాడులు చేయడం, తప్పులు చేయడం ఒప్పుకోమని డీజీపి ద్వారకా తిరుమలరావు హెచ్చరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో దిశ చట్టం అమలు కావడం లేదని అన్నారు. విలేకరుల సమావేశంలో రేంజ్ డీఐజీ డాక్టర్ షియోషి బాబ్జేయి, చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు, అడిషన్ ఎస్పీ అరీపుల్లా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**సిఎం ఇలాఖాలో**

# అధికారుల ఉరుకులు.. పరుగులు

## కుప్పానికి మళ్లీ మంచి రోజులు.. నెలలోపే పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదన.. పరిశీలనలు !!

కుప్పం, జూలై 14 ప్రభాతవార్త
ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో అధికార యంత్రాంగం ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. వచ్చే ఐదేళ్లలో కుప్పంలో మరింత రెట్టింపు అభివృద్ధి చేస్తామని ఇదివరకే ముఖ్యమంత్రి ప్రకటించిన నేపథ్యంలో నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు, పరిశీలనలు, స్థలాల ఎంపికలు జరుగుతున్నాయి. కుప్ప ం మండలం మల్లానూరు, శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులను మండలాలుగా ఏర్పాటుచేస్తామని సిఎం చంద్రబాబు గతనెల 25న కుప్పం బహిరంగ సభలో ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కొత్త మండలాల ఏర్పాటుపై రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలను నియమించి వాటి ద్వారా మండలాల పునర్విభజనకు సంబంధించి పంచాయతీలను విభజిస్తూ అధికారులు సమగ్ర నివేదిక రూపొందిస్తున్నారు. ఇది మరో రెండు మూడు రోజుల్లో తేలనుందని సమాచారం. మరో పక్క జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌తో కలసి సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పంలో కృషి విజ్ఞాన కేంద్ర ం, కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు స్థలాలను స్వయంగా పరిశీలించారు. మరో పక్క కుప్పంలో ఎయిర్‌స్ట్రిప్ నిర్మాణం కోసం విజలాపురం, అమ్మవారిపేట వద్ద గతంలో సేకరించిన భూములను పరిశీలించారు. ఇప్పటికే పలువురు రైతులకు పరిహారం అంది ఉండగా




కోర్టు వ్యవహారాల్లో ఉన్న భూములను త్వరగా క్లియర్ చేసేలా జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చొరవ చూపుతున్నారు. కుప్పం ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు నూతన భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలకై అధికారుల్ని ఆదేశించారు. ఇక నియోజకవర్గంలో ఉన్న పది ఆలయాలను అభివృద్ధి చేయాలని సిఎం చంద్రబాబు ఆదేశించడంతో ఇప్పటికే దేవదాయ శాఖ అధికారులు, స్థపతులు ఈ ఆలయాలను పరిశీలించి వాటి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇక కుప్పం ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను మోడల్ బస్‌స్టేషన్‌గా మార్చుతామని సిఎం చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో ఇప్పటికే తొలి విడతగా బస్‌స్టేషన్ స్థలాన్ని సర్వే చేయించారు. ఇందుకు సంబంధించిన సమగ్ర నివేదిక సైతం సిద్ధమవుతోంది. ఇక కుప్పం పట్టణాన్ని మోడల్ టౌన్‌గా మలచాలనే నేపథ్యంలో సిఎం ఆదేశాల మేరకు ఇటీవలే కుప్పంలో ఎపియుఐఎఎంఎల్ బృందం పరిశీలించారు. మోడల టౌన్‌గా కుప్పాన్ని మార్చేందుకు అవసరమైన ప్రణాళికల తయారీకి ఈ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలనలు జరిగి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించనుంది. ఇక కుప్పం నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగింపు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, పేదరికం లేని కుప్ప ంగా మార్చే లక్ష్యాలతో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడ)ను ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కడ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా యువ, ఉత్సాహవంతులైన ఐఎఎస్ అధికారి వికాస్ మర్మత్‌ను నియమించింది. బాధ్యతలు చేపట్టిన తొలిరోజే కడ పి.డి. వికాస్ మర్మత్ ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్‌తో కలసి కుప్పంలో అభివృద్ధి చేయనున్న బస్‌స్టేషన్, జమీందారీ పార్కు తదితరాలను స్వయంగా పర్యవేక్షించారు. ఇలా కుప్పం నియోజకవర్గంలో సిఎం చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టాక అధికార యంత్రాంగం ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తుండడం విశేషం. దీంతో జనం కుప్పానికి మళ్లీ మంచిరోజులు వచ్చాయి అని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## మహిళా అభ్యున్నతికి పెద్దపీట

**స్త్రీనిధి రుణం రూ. 5 లక్షలకు పెంపు**



కోట, జూలై 14 ప్రభాతవార్త
తెదేపా ప్రభుత్వం మహిళా సంఘాల అభ్యున్నతే లక్ష్యంగా అడుగు వేస్తోంది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం స్వయం ఉపాధి సంఘాలను బలో పేతం చేస్తూ మహిళలకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవడానికి చర్యలు ప్రారంభిచింది. అధికారంలోకి వచ్చి రెండు నెలల గడవక ముందే ప్రణాళికలు సిద్దం చేస్తోంది. వెలుగు ద్వారా రూ. 5 లక్షల రుణం స్వయం సహాయక సంఘాలకు అందించడానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలో అర్హులైన వారి జాబి తాను డీఆర్‌డీఏ అధికారులు సిద్దం చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం స్వయం సహాయ సంఘాలకు రూ 3.5 లక్షల మాత్రమే రుణం ఇచ్చేది. కూటమి ప్రభుత్వం ఈ పరిమితిని రూ.5లక్షలకు పెంచింది. సంఘలంలోని ఏడుగులు సభ్యులు ఉన్న పరిమితిని 10 వరకు పెంచింది. రుణం తీసుకున్నవారికి రెండేళ్ల వరకు మరెలాం టి అవకాశం ఉండేది కాదు. ఈ ప్రభుత్వం మధ్యలో రూ లక్ష తీసుకునే వెసుల బాటు సైతం కల్పిచింది. ఇలా సంఘాల బలోపేతం లక్ష్యంగా రుణాలు ఇస్తూ ఆర్థికంగా ఎదగడానికి కూటమి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. గత ప్రభుత్వంలో రణాల మంజారులో అవకతవకలు జరిగాయి. పొదుపు సొమ్ము జమ చేయడంలో చేతి వాటం ప్రదర్శంచేవారు. కొత్తగా కోలువుదీరిని కూటమి ప్రబుత్వం ఎక్కడా ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా నేరగా స్వయం సహాయక సంఘాలకు చెందిన సభ్యుల ఖాతలో నగదు జమ చేయనుంది. గ్రామ సమాఖ్యలకు గ్రేడింగ్ ఆధారంగా రుణాలు ఇవ్వనున్నారు. ఏ గ్రేడు రూ 75లక్షలు, బి.గ్రేడ్‌కు రూ 65 లక్షలు, సీ,గ్రేడ్‌కు రూ 55 లక్షలు డి. గ్రేడ్‌కు రూ 45 లక్షలు వరకు రుణాలు అందిచనున్నారు. రుణం తీసుకున్న సభయలు ప్రమాదవశాత్తూ మరణిస్తే తీసుకున్న మొత్తం మాపీ చేయనున్నారు.

## బాలిక మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి

**ఎమ్మార్పీఎస్, ప్రజాసంఘం నేతల రాస్తారోకో**




వెంకటగిరి, జులై 14, ప్రభాతవార్త
డక్కిలి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని సరీనా మృతికి కారకాలపై చర్యలు తీసుకోవాలని పాఠశాల వద్ద ఎమ్మార్పీఎస్ ప్రజా సంఘం నేతలు రాస్తోరోకో నిర్వహించారు. కమ్మపల్లి రోడ్డులో రాస్తోరోకో నిర్వహించారు. కమ్మపల్లి రోడ్డులో రాస్తారోకో వల్ల పలు వాహనాలు గంటలు తరబడి నిలిచిపోయాయి. దళిత విద్యార్థిని అడసనపల్లి సరీన మృతి చెంది 72 గంటలు కావస్తున్న నేటికీ ప్రభుత్వం నుండి ఏమి స్పందన లేదని ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాలు విద్యార్థి సంఘాలు బహుజన సామాజిక పార్టీ ఆందోళన చేపట్టారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీగా బయలుదేరి అనంతరం కమ్మపల్లి సెంటర్ నందు బాధితులుతో కలిసి రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు సూరిపాక వాసుదేవరా మాదిగ మాట్లాడుతూ గురుకుల పాఠశాల నందు దళిత విద్యార్థిని సరీన మృతికి కారణమైనటువంటి ఆ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ని అదే విధంగా సంబంధిత సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని లేని పక్షంలో రాష్ట్ర స్థాయి ఆందోళన చేపడుతామని తెలియజేశారు. అదే విధంగా తిరుపతి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు వేలూరు రాజేంద్ర మాదిగ మాట్లాడుతూ డాక్టర్ గురుకుల పాఠశాలలో ఒక దళిత విద్యార్థినికి ఇలాంటి సంఘటన జరగడం చాలా బాధాకరమని జిల్లాలో ఉన్న గురుకుల పాఠశాలలో ఇలాంటి విషయాలు పునరావృతం కాకుండా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి జరిగిన సంఘటన పై పూర్తి స్థాయిలో విచారణ చేసి సంబంధిత బాధితులను శిక్షించాలని కోరారు. లేనిపక్షంలో అన్ని గురుకుల పాటశాలలో ఉన్న సమస్యలను అధ్యయనం చేసిన తిరుపతి జిల్లా స్థాయిగా ఉద్యమన చేపడతామని తెలియజేశారు. అనంతరం బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు వెంకటేశ్వర్లు ఏపీ ప్రజాసంఘ ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునియ్య మాట్లాడుతూ దక్కిలి గురుకుల పాఠశాల ఒక వ్యాపార విద్య సంస్థకు మారిందని అనేకరకాల అవినీతి అక్రమాల జరుగుతున్నాయని అందులో భాగమే రాపూరు పట్టణానికి చెందిన అడసనపల్లి సరీన మృతి చెందడం జరిగిందని దీనికి కారణమైన వంటి కళాశాల ప్రిన్సిపాల్‌ని, హౌసింగ్ టీచర్ పిఈటి నర్సును వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉదయ్, అంబేద్కర్ పల్లిపాటి రవి మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మంగళపూరి సురేష్ మాదిగ, టౌన్ అధ్యక్షులు కంటిపల్లి మణి మాదిగ, చింతగుంట అంకయ్య, వెంకీ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వజ్ర వారాహీదేవి అలంకరణలో అమ్మవారు



తిరుపతి హెల్త్, జులై 14, ప్రభాతవార్త
రామచంద్రాపురం మండలంలోని రాయల చెరువు కట్ట సమీపంలో వెలసి వున్న శ్రీ శక్తి పీఠంలో వారాహీ దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారికి శ్రీ శక్తి పీఠ వ్యవస్థాపకులు జగద్గురువులు సిద్దేశ్వరానంద భారతి మహాస్వామి వారి దివ్య ఆశీస్సులతో, శ్రీ వారి ప్రత్యక్ష సమక్షంలో శ్రీ శక్తి పీఠాధశ్వరి, మాతృశ్రీ రమ్యానంద భారతీ స్వామిని వారి ఆధ్వర్యంలో అమ్మవారికి వివిధ సుగంధ భరిత పరిమళ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. పట్టు వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని శ్రీ వజ్ర వారాహీ దేవిగా అలంకరించారు. స్వామిని అమ్మవారికి దర్బారుసేవ నిర్వహించారు. మహిళలు సుహాసిని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యాన్ని కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. నవరాత్రులలో భాగంగా కళాకారులచే సాంస్కృతిక సంగీత కార్యక్రమాలు శ్రీ శక్తి పీఠంలో ఘనంగా నిర్వహించారు. నిరంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వేలాధిమంది భక్తులు పాల్గొన్నారు.

## శ్రీవారి సుప్రభాతసేవలో డిజిపి ద్వారకాతిరుమలరావు



తిరుమల, జులై 14 ప్రభాతవార్త:
కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి సుప్రభాత సేవలో రాష్ట్ర డిజిపి ద్వారకాతిరుమలరావు దంపతులు దర్శించుకున్నారు. డిజిపి హోదాలో తొలిసారిగా సాంప్రదాయ దుస్తుల్లో వేకువజామున ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి డిజిపి దంపతులకు స్వామివారి దర్శనం చేయించారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

## నీరసించిన నిమ్మ రైతు

**కోత కూలీలకు కూడా గిట్టని ధరలు**
**అన్‌లైన్ మార్కెట్ అందుబాటులో లేక కమిషన్ ఏజంట్లపై అధారం**
**పట్టించుకోని పాలకులు,అధికారులు**



వెంకటగిరిరూరల్, జూలై 14 ప్రభాతవార్త:
నిమ్మ రైతులు నీరసించారు. కనీస ఖర్చులకు కూడా కాసులు దక్కక కన్నీరు పెడుతున్నారు. దిగుబడి బాగా ఉన్నపుడు ధరలు లేక, ధరలు ఉన్నపుడు దిగుబడి లేక, పెట్టిన పెట్టుబడులు తిరిగి రాకా అప్పుల పాలవుతున్నారు. దిగుబడులను నిల్వచేసే ఆవకాశాలు లేక, అన్ లైన్ మార్కెట్ అందుబాటులో లేక కమిషన్ ఏజెంట్లపై అధారపడి నిలువు దోపిడికి గురవున్నారు. రాష్టంలోనే నిమ్మసాగులో తిరుపతి జిల్లాతోపాటు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో అధికంగా ఉంది. రాష్టం మొత్తం మీద రెండు లక్షల ఎకరాల్లో నిమ్మసాగు ఉంటే ఒక్క తిరుపతి జిల్లాలోనే 40 వేల ఎకరాలల్లో సాగవుతోంది. మన రాష్ట్రంలోనే నిమ్మ వ్యాపారానికి గూడూరు, వెంకటగిరి, పొదలకూరు, మార్కెట్లుకు మంచి డిమాండ్ ఉంది. పలు జిల్లాల నుంచి గూడూరు మార్కెట్‌కు నిమ్మకాయలు దిగుమతి అవుతుంది. గూడూరు నుంచి రైలు రోడ్డు మార్గాల ద్వారా బొంబాయి, కర్నాటక, ఢిల్లీ, ఆహ్మదబాద్, వారాణాసి, పాట్నా, కోల్‌కత్తా, తదితర సూదూర ప్రాం తాలకు పెద్ద ఎత్తున ఎగుమతులు జరుగుతాయి. ఏప్రిల్, మే నెలల్లో దిగుబడి తక్కువగానే ఉన్నా ధరలు బాగా ఉండి రైతులకు లాభాలు తెచ్చిపెట్టగా ప్రస్తుతం పరిస్థితి తారుమారైంది. ప్రస్తుతం దిగుబడి అధికంగా ఉన్న ధరలు మాత్రం పెద్దగా లేక పోవడంతో ఉద్యనవన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. రెండు నెలలుగా దక్షిణాది రాష్ట్రాల్లో మంచు వర్షాలు కారణంగా నిమ్మకు డిమాండ్ తగ్గింది. గత కొద్ది నెలల క్రితం 1500 రూపాయలు నుంచి 2 వేలు రూపాయలు వరకు పలికిన నిమ్మ ధరలు ప్రస్తుతం 600 రూపాయులు నుంచి 800 రూపాయలకు పడిపోవడంతో నిమ్మ సాగు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు వాతావారణంలో మార్పులు కారణంగా నిమ్మవాడకం తగ్గడంతో నిమ్మ సాగు రైతులు తీవ్ర నష్టాల బారిన పడినట్లు నిమ్మ సాగు రైతులు వాపోతున్నారు.

# కరెంట్ కోతలు: చీకటితో కాపురాలు

**విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం**

శ్రీకాళహస్తి, జూలై 14 ప్రభాతవార్త
శ్రీకాళహస్తిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ కష్టాలు వర్ణతీతంగా మారింది. ముఖ్యంగా సివారు ప్రాంతాల్లో విద్యుత్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత ఐదేళ్ళలో నిర్వహణ లేక కొత్త ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయక పోవటంతో పరిస్తితి ఆగమ్యగోచరంగా మారింది. పట్టణం పెరుగుతున్నా విద్యుత్ సదుపాయాలు పెరగటం లేదు. దడ పుట్టించే బిల్లులు నెలకు చేతికి ఇస్తున్న విద్యుత్ శాఖ సరఫరాలో లోపాలను సరిద్దిదలేక పోతున్నారు. ముఖ్యంగా ఎస్‌డికె నగర్, ఆసుపత్రి మార్గం, చెంచులక్ష్మీ కాలనీలకు విద్యుత్ సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. ఈ ప్రాంతాల్లో చినుకు పడితే అంధకారం చోటు చేసుకుంటుంది. తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని ఆగమ్యగోచర పరిస్థితి చోటు చేసుకుంది. నగరం ఎస్‌డికె నగర్ వైపు పెరుగుతుంది. ఇక్కడే అపార్టు మెంట్లు వెలుస్తున్నాయి. ప్రభుత్వాసుపత్రి, సమీకృత విద్యార్థుల వసతి గృహం నిరుపేదలు నివాసముంటున్నారు. పట్టణ సివారుల్లో ఉన్న ఈ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ప్రశ్నార్థంగా మారిందని వాపోతున్నారు. ఎన్నో సార్లు ఈ ప్రాంత ప్రజలు విద్యుత్ శాఖ లైన్ మెన్ దృష్టికి తీసుకొస్తున్నారు. కానీ పట్టించుకునే దిక్కులేదు. అసలే బైపాస్‌కు సమీపంలోని ఈ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లలో కొందరు మందుబాబులు రాత్రి వేళల్లో బార్‌లుగా మలచుకుంటున్నారు. ఇక ఇక్కడ దొంగల భయం కూడా అధికంగానే ఉంది. అలాంటి ప్రాంతాల్లో వర్షం కురిసినా, ఉరుములు ఉరిమినా విద్యుత్ సరఫరా ఆగిపోతుంది. దడ పుట్టించే బిల్లులను వసూలు చేసుకునే విద్యుత్ శాఖ రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా ఆగిపోతే ఏదైనా జరిగితే బాధ్యులెవరన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఒక్కొక్కసారి రాత్రి కరెంటు పోతే ఉదయం వరకు తిరిగి ఇవ్వరు. రాత్రంతా పసిపిల్లలతో కుటుంబాలు పడుతున్న కష్టం వర్ణనాతీతంగా మారింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు చెంచులక్ష్మీకాలనీ పరిసరాల్లో విద్యుత్ సరపరా లేక ప్రజలు తిప్పలు పడ్డారు. ఈ అంశంపై విద్యుత్‌శాఖ ఎడిఇకి కూడా ఫిర్యాదు అందింది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఈ ప్రాంతాల్లో నిరాటంకంగా విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అంతేకాక ఆసుపత్రి నుంచి బైపాస్ వరకు వీధి దీపాలు కూడా లేదు.



## గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

రామకుప్పం, జూలై 14 ప్రభాతవార్త

మండలంలోని నెర్నిల్లి గ్రామంలో వెలసిన శ్రీ గంగమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రిగా మరలా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టడంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి జంతు బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం దేశం నేతలను గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, సుబ్రమణ్యం, చంద్రశేఖర్‌రెడ్డి, నవీన్, గిరి, సుధాకర్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వెంకటగిరి రూరల్ జూలై 14,ప్రభాతవార్త:

రాష్ట్రంలోనే అధికంగా నిధులు తీసుకొచ్చి వెంకటగిరి నియోజకవర్గంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను టిడిపి పార్టీ నాయకులు,కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మండలం తెలుగు దేశం పార్టీ రూరల్ అధ్యక్షుడు పప్పు చంద్రమౌళిరెడ్డి అన్నారు. అదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాల మేరకు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు శ్రీకారం చూడుతున్నట్లు వివరించారు.

## త్రిపుల్ ఐటిలో బాలికల ప్రతిభ

శ్రీకాళహస్తి, జూలై 14 ప్రభాతవార్త



పట్టణంలోని కొత్తపేటలో ఉన్న జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదోతరగతి చదివిన ఐదు మంది విద్యార్థులు నూజివీడు త్రిపుల్ ఐటిలో సీటు సాధించినట్లు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు జయసుధ తెలిపారు. వీరిలో ఎన్.హరిక, ఎస్‌కె.సుమయ, ఎస్‌కె.యాస్మిన్‌తాజ్, ఎ.నవ్యశ్రీ, ఎ.నూతనశ్రీలు ఎంపికయినట్లు తెలిపారు. ఈసందర్భంగా వీరిని ప్రధానోపాధ్యాయురాలితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలోపిడి రమణ తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో సబ్‌జైలు ఏర్పాటు అయ్యేనా..?

– పోలీసు సబ్ డివిజన్‌గా ఉన్న కుప్పం..

రిమాండ్‌కు తరలించాల ంటే మదనపల్లి.. చిత్తూరు జైల్లే శరణ్యం !!

కుప్పం, జూలై 14 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో సబ్ జైలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికే కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లె, రాళ్లబూదుగూరు పోలీస్‌స్టేషన్లతో కలిసి కుప్పం పోలీస్ డివిజన్‌గా ఏర్పడింది. ఇక్కడ డిఎస్పీ స్థాయి అధికారి, ఇద్దరు సిఐలు, నలుగురు ఎస్సైలు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కుప్పం పోలీస్ సబ్ డివిజన్ కావడంతో ఇక ్కడ సబ్‌జైలు ఏర్పాటుచేస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో పలమనేరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో కుప్పం ఉండేది. కుప్పం ప్రాంతంలో జరిగిన నేరాల్లో నిందితులకు న్యాయమూర్తులు రిమాండ్ విధిస్తే వారిని పలమనేరు సబ్‌జైలుకు తరలించేవారు. ప్రస్తుతం పలమనేరులో సబ్ జైలు లేకపోవడంతో కుప్పం ప్రాంతానికి చెందిన నిందితులను జిల్లా కేంద్రమైన చిత్తూరు లేదా అన్నమయ్య జిల్లాలో ఉన్న మదనపల్లి సబ్ జైలుకు తరలించాల్సి వస్తోంది. దీంతో నిందితులను తరలించేందుకు అటు పోలీసు సిబ్బందికి ఇబ్బందులు ఉండగా నిందితులను చూడాలని వారి కుటుంబీకులు అక్కడకు చేరుకోవాలంటే ఇబ్బందికరంగా మారుతోంది.ఇదిలా ఉండగా కుప్పంలోనే ఇప్పటికే జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు ఉన్నాయి. వివిధ నేరాల్లో ఈ కోర్టుల పరిధిలోనే రిమాండ్ విధించనున్న నేపథ్యంలో కుప్పంలోనే సబ్ జైలు ఏర్పాటుచేస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని జనం వ్యక్తం చేస్తున్నారు. మరి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

## ఆషాడమాసం పోటెత్తిన భక్తజనం

–ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

బోయకొండ(చౌడేపల్లి), జూలై 14 ప్రభాతవార్త



శక్తిక్షేత్ర బోయకొండ ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచివున్నారు. ఆషాడమాసం కావడంతో రాష్ట్రంతోపాటు కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు తరలిరావడంతో అమ్మవారి కొండ భక్తజనసంద్రమైంది. ఇసుకేస్తే నేల చేరదన్నట్లుగా ఎక్కడ చూసిన భక్తుల తాకిడి కనిపించింది. వాహన రద్దీ అధికం కావడంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లింది. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం క్యూలైన్లలోని భక్తులకు ఎలాంటి ఆటంకం కల్గకుండా దర్శనాలు చేయించారు. ఆలయ అధికార సిబ్బంది సేవలందించారు. పుంగనూరు రూరల్ (చౌడేపల్లి) సిఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డిల ఆధ్వర్యంలో కొండపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు చర్యలు చేపట్టారు.

## నేడు పోలీస్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు టౌన్, జూలై 14 ప్రభాతవార్త

ప్రజల సమస్యలను పరిష్కరించడానికి సోమవారం జిల్లా పాత పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు పాల్గొని సమస్యలపై ఫిర్యాదులు చేసి వాటిని పరిష్కరించుకోవచ్చునన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం తరపున ప్రజల నుండి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించడానికి ఈ కార్యక్రమం ద్వారా చర్యలు తీసుకుంటామని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు.

## పాఠశాలకు ప్రహరీ గోడ కట్టించండి

పాకాల, జులై 14, ప్రభాతవార్త



పాకాల మండలం ఉప్పరపల్లె పంచాయితీ అగ్రహారం గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో పిల్లలు వారి తల్లిదండ్రులు కలిసి కట్టెలతో కాంపౌండ్ నిర్మించుకొన్నటువంటి పరిస్థితి. స్కూల్ ఆవరణలో ఉన్న మరుగుదొడ్లకు సరైన తలుపులు లేక పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితిని విద్యాశాఖ ఉన్నతాధికారులు గమనించి నూతన మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి పాఠశాలకు కాంపౌండ్ వాల్ మంజూరు చేయాలల్సిందిగా స్థానికులు, పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు ప్రదానం

కుప్పంరూరల్, జూలై 14 ప్రభాతవార్త



మండలంలోని జరుగు పంచాయతీలో నిర్వహించిన జెఆర్‌సి క్రికెట్ టోర్నీ ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈ టోర్నీలో విజేతలుగా నిలిచిన ఎన్‌ఆర్‌సి టీం కెప్టెన్ సుజికి యాభైవేల నగదు, ట్రోఫీని నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం అందజేశారు. అలాగే రెండో బహుమతిగా అజిత్ జట్టుకు ముప్పై వేలు, మూడో బహుమతిని జెఎస్‌ఆర్ జట్టు కెప్టెన్ జయశంకర్‌రెడ్డి ఇరవై వేలు, నాలుగో బహుమతిని రజనీ జట్టు పదివేలు గెలుచుకుంది. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు డా॥ సురేష్‌బాబు, గోపీనాథ్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, తెలుగుయువత నేతలు జాకీర్, చెక్కునత్తం మణి, జెఎంసి మురళి, మహేంద్ర, వాసు, నిర్వాహకులు రాహుల్ చంద్, కమల్, తెదేపా, జనసేన, బిజెపి నేతలు పాల్గొన్నారు.

## దేశం నేత కుమారుడిపై దాడి.. రిమాండ్‌కు తరలింపు

రామకుప్పం, జూలై 14 ప్రభాతవార్త

మండలంలోని 89 పెద్దూరు పంచాయతీ ననియాలకు చెందిన తెదేపా నేత మనోహర్ కుమారుడు చరణ్‌సాయిపై శనివారం రాత్రి వైకాపా నేతలు దాడి చేశారు. సర్పంచ్ భర్త గోవిందప్ప, అతని అనుచరులు సతీష్, మురుగేష్‌లు మారణాయుధాలతో దాడి చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో దాడికి పాల్పడిన వైకాపా నేతలపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

## ఘనంగా జనసేన పార్టీ పతాకావిష్కరణ

రామకుప్పం, జూలై 14 ప్రభాతవార్త



మండలంలోని 89 పెద్దూరు పంచాయతీలో జనసేన పార్టీ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఎన్డీయే కూటమి నేతలు నిర్వహించారు. ఈసందర్భంగా జనసేన అధ్యక్షుడు హరీష్, టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి మాట్లాడుతూ వచ్చే ఐదేళ్లలో ఎన్డీయే ప్రభుత్వం ప్రజాపాలన సాగించి సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో నేతలు నరేష్, రామూర్తి, నరసింహులు, చిన్నికృష్ణ, విశ్వనాథ్, బాలరాజు, వెంకటరమణ, అవినాష్, సురేష్ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## టాటాఏసీ బోల్తా : 8మందికి గాయాలు

చౌడేపల్లి, జూలై 14 ప్రభాతవార్త



టాటాఏసీ బోల్తా పడి 8మందికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. కర్ణాటకరాష్ట్రం కెజిఎఫ్ తాలూకా పుగనపల్లి, కొడిగిపల్లి, హన్సూరుకు చెందిన గ్రామస్తులు టాటాఏసీలో శక్తిక్షేత్రం బోయకొండకు బయలుదేరి వచ్చారు. మార్గ మద్యలో మండలంలోని కరణంవారిపల్లి స్టేజీకి సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న వెంకట్రామప్ప(60), సుగుణమ్మ(35), సుబ్బరత్న(55), కృష్ణమ్మ(45), సుమ(29), నారాయణమ్మ(40), సుశీలమ్మ(45), అమరమ్మ(38)లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని 108సిబ్బంది చిట్టిబాబు, ప్రసాద్, గణేష్‌లు పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## తేదేపా కార్యకర్తలకు అండగా ఉంటుంది : గువ్వల

చౌడేపల్లి, జూలై 14 ప్రభాతవార్త



తేదేపా కార్యకర్తలకు అండగా వుంటుందని ఆపార్టీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష రెడ్డి(చిట్టి) అన్నారు. మండలంలోని చింత మాకులపల్లి పంచాయతీ ఖాన్‌సాబ్‌మిట్టలో అనారోగ్యంతో బాధపడుతున్న తేదేపా కార్యకర్త హాజీజుల్లాను ఆయన పరామర్శించారు. పార్టీకోసం కష్టపడి పనిచేసివారిని గుర్తిస్తుందన్నారు. అలాంటి వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న హాజీజుల్లా అతని కుటుంబానికి అన్ని విదాలా అండగా వుంటామన్నారు. నాయకులు శ్రీదర్‌రాజు(గిరి), వినోద్‌కుమార్‌రెడ్డి, బోయకొండ సుబ్బు, ఖాదర్‌భాషా, సోషియల్ మీడియా ప్రతినిధి కళ్యాణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హోం మంత్రిని కలిసిన ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు టౌన్, జూలై 14 ప్రభాతవార్త



రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనితను ఆదివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు మర్యారపూర్వకంగా కలిశారు. విశాఖపట్నం వెళ్ళిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆదివారం హోమ్ మంత్రి వంగలపూడి అనిత స్వగృహం చేరుకొని ఆమెను కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

## సూర్యనారాయణస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు టౌన్, జూలై 14 ప్రభాతవార్త

శ్రీకాకుళం జిల్లా అరసవెల్లి శ్రీ సూర్యనారాయణస్వామి దేవస్థానంలో స్వామి వారిని ఆదివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు దర్శించుకున్నారు. ఆలయంలలో దర్శనానికి వెళ్లిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు సూర్య నమస్కారాల అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఇఓ, అర్చకులు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుకు స్వామి వారి ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాలను అందజేశారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు టౌన్, జూలై 14 ప్రభాతవార్త

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి ఈ కార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యానవన చెట్లు నాటాలి

–సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బిజి రాజులు

వెంకటగిరిరూరల్ జూలై 14 ప్రభాతవార్త:



ప్రభుత్వ కార్యలయాలల్లో ప్రభుత్వ వసతి గృహాల్లో ఉద్యానవన చెట్లు నాటేందుకోసం కృషి విజ్ఞాన కేంద్ర ఉచితంగా ఉద్యానవన మొక్కలు అందజేస్తుందని పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బిజి రాజాలు అన్నారు. అదివారం వాక్‌మెట్స్ అసోషియన్ ఆధ్వర్యంలో వెంకటగిరి ట్రాన్స్‌కో కార్యాలయంలో మామిడి, జామ, సపోటా,నిమ్మ,బత్తాయి మొక్కలు నాటినట్లు తెలియజేశారు.వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటడం వల్ల పర్యావరణం పరిరక్షణతో పాటు మంచి ఫలాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అదేవిధంగా ఉద్యానవన మొక్కలు అవసరం అయిన వారు కృషి విజ్ఞాన కేంద్రంకు తెలియజేస్తే తప్పకుండా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు, పాఠశాలలు, హాస్టళ్ళు, గురుకుల పాఠశాలలకు ఉచితంగా పండ్ల మొక్కలు అందజేస్తామన్నారు. వాక్‌మేట్స్ సభ్యులు ట్రాన్స్‌కో ఎఇ శ్రీనివాసులు,గోపి,కుప్పయ్య,భాషా,మల్లి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సంపూర్ణ పోషకాహారం తీసుకోవాలి

డాక్టర్ రవి కుమార్

కోట,జూలై 14 ప్రభాతవార్త

జింక్ ఫుడ్ ను విపరీతంగా తినడంతో ప్రజలు పలు రకాల అనారోగ్య సమస్యలు చుట్టు ముడుతున్నాయని గూడూరు ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి,డాక్టర్. మద్దుర రవి కమార్ అన్నారు. కోటలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పంటలు సాగులో వాడిన క్రిమి సంహారక మందుల అవశేషాలతో కలుషితమైన ఆహార పదార్థాలను మనకు తెలియకుండానే తీసుకొవడం జరుగుతుందన్నారు. కల్తీ లేకుండా సులభంగా జీర్ణమయ్యే సంపూర్ణ పోషకాహారం తీసుకోవడం ఉత్తమంన్నారు,ఆహార అలవాట్లు ,నియమాల విషయంలో చాల మంది ఓ నిర్ణయానికి రాలేకపోతుంటారని, ఉదయం, అల్పహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి పడుకనే ముందు తినాల్సిన పదార్థాల విషయంలో ఎటూ తేల్చుకోలేకపోతుంటారని పేర్కొన్నారు. ఫలితంగా కొందరు ఎక్కువ కేలరీలున్న ఆహారం తీసుకుంటే మరి కొందరు డైటింగ్ పేరిట కడుపు మాడ్చుకుంటున్నారని దీంతో శరీర బరువులో మార్పులు వస్తున్నాయన్నారు. ఈ నేపద్యంలో తృణధాన్యాలను నానబెట్టి మొలకలు వచ్చాక తినడం ఏంతో ఆరోగ్యకమన్నారు. పెసలు,శెనగలు,గోధుమలు, లాంటి గింజులు మొలకలు వచ్చిన తర్వాత తినడం వల్ల శక్తి చేకూరుతుందని వివరించారు.మొలకెత్తిన గింజల్లో ముఖ్యంగా జీర్ణక్రియకు తోడ్పడే ఎంజైమ్‌లు అధికంగా ఉంటాయన్నారు. ఎంజైమ్‌లు ప్రోటీన్లను, శరీరానికి పయోగపడే ఎమైనో, అమ్లాలను పిండి పదార్ధాన్ని గ్లూకోజ్‌గా తయారు చేస్తాయన్నారు. మొలక ధాన్యాల్లో విటమిన్ ఎ,బి,సీ, విటమిన్ల అత్యధికంగా లభిస్తాయన్నారు.

## పేదలకు అన్నదానం

సూళ్లూరుపేట, జూలై 14 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని లయన్స్ క్లబ్ షార్ వారి ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బస్టాండు ఆవరణలో ఈ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ సభ్యులు పిఆర్‌సి మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణరావు, కోశాధికారి అప్పారావు, ఛార్టెడ్ ప్రెసిడెంట్ ఆదిశేషారెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించండి

సూళ్లూరుపేట, జూలై 14 ప్రభాతవార్త

సూళ్లూరుపేట నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల్లో తమకు ప్రాధాన్యత కల్పించాలని బిసి దేవాంగ సాధికార కమిటీ తిరుపతి పార్లమెంటు కన్వీనర్ శివశంకర్ నాప మునిరాజా ఆదివారం తిరుపతి పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొల్ల నరసింహయాదవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. తాము తమ దేవాంగ సాధికార కమిటీ ఆధ్వర్యంలో పార్టీ అభ్యర్థుల కోసం విస్తృతంగా పనిచేసి వారి విజయానికి తమవంతు సహకారం అందించామన్నారు. 2019 నుంచి 2024 వరకు పార్టీ కోసం అనేక కష్టనష్టాలకోర్చి పనిచేశామని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని తమకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బుద్ధి విజయలక్ష్మి, సజ్జా శివ హరికుమార్, బండారు శారద, కొండా వెంకటేష్, నవీన్‌కుమార్, గిరిప్రసాద్, వెంకటరత్నం, పిచ్చుక నవీన్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## డివిసత్రంలో వర్షం

దొరవారిసత్రం జూలై 14 ప్రభాతవార్త ;

బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గతరెండు రోజుల నుండి దొరవారిసత్రం మండలంలో వర్షాలు పడుతున్నాయి.కురుస్తున్న వర్షాలకు అన్నదాతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.వరుసగా కురుస్తున్న బారీవర్షాలకు గ్రామాల్లో రోడ్లు,వీదులు బురదమయంగా మారుతున్నాయి. గుంటలు,కాలువల్లో వరదనీరు ప్రవహిస్తుంది. గ్రామాల్లో ఎక్కడ సూచిన పారిశుద్యం లోపించడం వల్లస విషజ్వరాలు ప్రబలుతాయని గ్రామీణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.పంచాయితీ పాలకులు,అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.గ్రామాల్లో రైతులు వ్యవసాయపనులుచేపడుతున్నారు.ఈవర్షాలుఎడగారుసాగుచేపట్టిన రైతులకు కొంతవరకు ఊరటనిస్తుంది.

## గురుకుల పాఠశాల విద్యార్థిని మృతి పై పూర్తి స్థాయి విచారణ

గురుకుల విద్యాసంస్థల జిల్లా కోఆర్డినేటర్ పద్మజ

వెంకటగిరి, జులై 14, ప్రభాతవార్త



డక్కిలి గురుకుల పాఠశాలలో మృతి చెందిన విద్యా ర్థిని సరీనా ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేస్తామని గురుకుల విద్యా సంస్థల జిల్లా కోఆర్డినేటర్ పద్మజ తెలిపారు. గురుకుల పాఠశాల ఘటన పై జిల్లా పంచాయితీ అధికారి సుశీల జిల్లా వైద్య శాఖ అధికారి శ్రీ హరి, డిఎల్‌పిఓ వెంకటరమణ విచారణ జరిపారు. బాలిక ఎలా మృతి చెందిందో పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని డిసిఓ చెప్పారు. పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ లేదని గ్యాస్ సిలిండర్ కొరత ఉందని విద్యార్థులు ఆమెకు తెలిపారు. ఈ సమస్యలు కూడా పరిష్కరిస్తానని ఆమె చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిపిఓ సుశీల సిబ్బందిని ఆదేశించారు. ప్రతి రోజు క్లోరినేషన్ చేయాలని తెలిపారు.ఎంపిడిఓ లీల మాధురి, ప్రిన్సిపాల్ శ్రీదేవి తదితరులు ఉన్నారు.

## టిడిపి నేత గంగా ప్రసాద్ హామీతో ప్రజా సంఘాల ఆందోళన విరమణ

బాలిక మృతిపై విచారించమని ఆర్డిఓకి ఆదేశం

వెంకటగిరి, జులై 14, ప్రభాతవార్త



దక్కిలి గురుకుల పాఠశాలలో మృతి చెందిన సరీనా అనే విద్యార్థిని మృతి పై విచారించి చర్యలు తీసుకో వాలని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్‌ను టిడిపి నేత గంగ ప్రసాద్, మాజీ ఎంపి నెలల సుబ్రమణ్యం కోరారు. మృతి చెందిన బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ ప్రజాసంఘాల నాయకులు ఆందోళన చేస్తున్నారు. వారి వద్దకు గంగా ప్రసాద్ వచ్చి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. వెంటనే ఆయన ఆర్డిఓకు ఫోన్ చేసి గురుకులు పాఠశాల ఘటన పై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. సోమవారం పాఠశాలకు వచ్చి విచారిస్తానని ఆర్డిఓ తెలిపారు. బాధిత కుటుంబానికి తగు న్యాయం చేస్తానని గంగ ప్రసాద్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చూసుకుంటారని గంగ ప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామని ఆయన తెలిపారు.

## మంత్రులను కలిసిన ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు, జులై 14, ప్రభాతవార్త



నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా నెల్లూరుకు విచ్చేసిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనా రాయణ రెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రమానాయుడుని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమా ర్ మర్యాదపూర్వకంగా కలిసా రు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మంత్రులతో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గూడూరు నియోజకవర్గంకు రావాల్సిన త్రాగు, సాగు నీటిని అంతరాయం లేకుండా అందించాలని కోరుతూ పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

## పడకేసిన చెత్తాచెదారాన్ని తొలగించాలి

వాకాడు, జులై 14, ప్రభాతవార్త

వాకాడులోని రోడ్డుకి ఇరువైపులా చెత్తా చెదారం నిల్వ పడకేయడంతో దుర్వాసనతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత మూడు రోజుల నఉండి కురుస్తున్న వర్షాలకు దోమల బెడద ఎక్కువ అవ్వడంతో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ప్రజలు వ్యాధిన బారిన పడకుండా ఉండేందుకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న సైడ్ కాలువలో వ్యర్థాలు, చెత్త కుప్పలు అధ్వానంగా ఉండడంతో దోమల బెడద ఎక్కువైంది. వర్షాలు పడుతున్న సమయంలో కూడా సైడు కాలువలో గానీ, రోడ్డుకి ఇరువైపులా ఉన్నటువంటి చెత్తా చెదారంలో ఎలాంటి శానిటేషన్ పనులు జరగకపోవడం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడో ఒకసారి ఎమ్మెల్యేగాని, జిల్లా అధికారులు వచ్చిన ఏరియాలో మాత్రమే నామ మాత్రంగా బ్లీచింగ్ చల్లడం జరుగుతుంది. ఈ సీజనల్‌లో డెంగీ, మలేరియా జ్వరంతో పాటు చేసిన వ్యాధులు ప్రభలే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ప్రజలను అవగాహన కల్పించేందుకు కనీసం వైద్య సిబ్బంది కనుమరుగయ్యారు. వాకాడులోని పాత దళితవాడ, బజారు వీధి, ఎస్టి కాలనీ, జనార్ధన్ రెడ్డి కాలనీ, బీసీ కాలనీలో రోడ్డుకి ఇరువైపులా ఉన్న డ్రైనేజీలో చెత్తా చెదారం తొలగించి రసాయనిక పిచికారితో పాటు,రోడ్డుకి ఇరువైపులా బ్లీచింగ్ చల్లాలన్నారు. మండలంలోని అన్ని పంచాయితీలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది క్యాంపులు ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## బ్రాహ్మణులందరూ తప్పనిసరిగా సంధ్యా వందనం ఆచరించాలి

టిటిడి వేద విద్యాలయం ప్రొఫెసర్ పవన్ శర్మ

వెంకటగిరి, జులై 14, ప్రభాతవార్త



బ్రాహ్మణులందరూ తప్పనిసరిగా సంధ్యావందనం ఆచరించాలని టిటిడి వేద విద్యాలయం ప్రొఫెసర్ పవన్ శర్మ తెలిపారు. వెంకటగిరిలో భార్గవ రామబ్రాహ్మణ సేవా సంఘం ద్వారా విశ్వగురు వేద విశ్వవిద్యాలయంలో సంధ్య వందనం పై ఆయన ప్రవచనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంత బిజీగా ఉన్నా సంధ్యావందనానికి కొంత సమయాన్ని కేటాయించాలని తెలిపారు. ఉపనయనం ఆయన వారందరూ సంధ్యావందనం ఆచరించాలని సూచించారు. సంధ్య అనే అమ్మవారికి వందనం చేయడం సంధ్యావందనమని తెలిపారు. సంధ్యావందనం ఆవశ్యకత గురించి ఆయన వివరించారు. జేవీఎస్ శాస్త్రి, బాబీ శర్మ, విశ్వం తదితరులు సత్కరించారు.

## కండలేరు జలాశయం అభివృద్ధికి నిధులివ్వండి

మంత్రి రామానాయుడుని కోరిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జులై 14, ప్రభాతవార్త



రైతులకు సాగు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన కండలేరు డ్యామ్ అభివృద్ధికి నిదులు ఇవ్వాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. కండలేరు డ్యాంను పరిశీలించేందుకు మంత్రి రామానా యుడుతో పాటు దేవాదాయ శాఖ మంత్రి పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ వచ్చారు. కండలేరు డ్యామ్ నుండి చెన్నై నగరానికి కూడా తెలుగు గంగ కాలువ ద్వారా నీరు అందిస్తున్నట్లు తెలిపారు. సోమశీల – స్వర్ణముఖి లింకు అసంపూర్తిగా ఉందని నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కోరారు. ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులు కూడా నిధులు ఇవ్వాలని కోరారు. వెంకటగిరి నియోజకవర్గంలోని చెరువుల అభివృద్ధి చరిత్ర అంశాలను మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు.

## మా కడుపు కొట్టొద్దు

– ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల ఆవేదన

కోట, జూలై 14 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించేందుకు ప్రయత్నాలు చేయడం బాధాకరమని పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 18 సంవత్సరాల నుంచి కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నడుస్తున్న ఉపాధి హామీ పథకం కింద కూలీల చేత పార్టీలకు అతీతంగా పనులు చేయించుకుంటూ పోతున్నామని చెప్పారు. తమకు ఇప్పటివరకు మూడు ప్రభుత్వాలు మారినా, తమను ఎవరూ మానసికమైన ఇబ్బందులకు గురిచేయలేదని చెప్పారు. ఎక్కడైనా పొరపాట్లు ఉంటే సూచనలిస్తే సరిచేసుకుంటామే గాని తమ పొట్ట కొట్టొద్దని వారు కూటమి నాయకులను కోరుతున్నారు.

## మొక్కులు తీర్చుకున్నాం: సమస్యలు పరిష్కరించండి:

రిషితారెడ్డికి విన్నపం

శ్రీకాళహస్తి,జూలై 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి శాసనసభ్యుడుగా సుధీర్‌రెడ్డి గెలవాలని పలువురు గ్రామస్తులు గ్రామ దేవతలకు మొక్కులు మొక్కుకున్నారు. పట్టణ నడిబొడ్డులోని స్వర్ణముఖి నదీ ఒడ్డున వెలసిన కరిమారియమ్మ ఆలయ పూజారి పలణి స్వామి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం వీధిలో ఊరేగింపు నిర్వహించారు.వారితో పాటు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె కరిమారియమ్మను దర్శించుకున్నారు. ఆమె ఆలయానికి వచ్చిన మహిళా భక్తులకు పసుపు కుంకుమ,గాజులు ప్రసాదంగా అందించారు.ఈ సందర్భంగా ఇక్కడ నివాసముంటున్న ప్రజలు రిషితారెడ్డికి తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. దీర్ఘకాలంగా దొబీఘాట్ శిధిలావస్థకు చేరుతున్నా మున్సిపాలిటి పట్టించుకోవటం లేదని ఆమె దృష్టికి తెచ్చారు. ఇక ఆనకట్టపై పొద్దుగుంకితే ఆకతాయిలు,మందుబాబుల ఆగడాలు పెచ్చుపెరిగిపోతున్నాయని మహిళలు ఆమె దృష్టికి తెచ్చారు. రిషితారెడ్డి వెంటనే స్పందిస్తూ దోభీఘాట్ మరమ్మత్తులకు సంబంధించి మున్సిపల్ అధికారులకు సూచించారు. అలాగే ఇక్కడ ఆకతాయిలకు సంబందించి పోలీసులకు సమాచారం అందించారు. ఆమెతో పాటు బి.రేణుకాదేవి,సూర్య ప్రభ,వాకచర్ల గుర్రప్ప శెట్టి,జిలాని, కాసరం రమేష్,శ్రీనివాసులు,

## 62కిలోల భారీకేక్‌తో గుర్రప్పశెట్టి జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి, జూలై 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణ తెలుగుదేశంపార్టీ సీనియర్‌నాయకుడు, మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి 62వ జన్మదిన వేడుకల సందర్భంగా పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుయువత మాజీ రాష్ట్ర కార్యదర్శి బిజె.ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం ముందు భారీగా బాణాసంచాపేలుస్తూ పార్టీ కార్యాలయంలో గుర్రప్పశెట్టిచేత భారీ కేక్‌కట్‌చేయించి పలువురు నాయకులు దుశ్శాలువతో సత్కరించి కేక్‌కట్‌చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిపూడి దశరధాచారి, టౌన్‌బ్యాంకు మాజీ ఛైర్మన్ డి.వి.నారాయణ, బిసి నాయకుడు ఉమేష్‌రావు, నెమళ్ళూరుసుబ్రమణ్యం, కాసరం రమేష్, పుల్లూరు మునిరెడ్డి, మునిరాజయాదవ్, వజ్రంకిషోర్, చీరాల అధినేత రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సన్నిధిలో పత్తిపాడు ఎంఎల్‌ఏ

శ్రీకాళహస్తి, జూలై 14 ప్రభాతవార్త



ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయానికి గుంటూరు జిల్లా పత్తిపాడు నియోజకవర్గ ఎంఎల్‌ఏ వరువుల సత్యప్రభ కుటుంబసభ్యులతో శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు.ఈసందర్భంగా వీరికి ఆలయ ఇఒ ఎన్‌విఎస్‌ఎన్‌మూర్తి ఆలయ దక్షిణగోపురం వద్ద స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో వెలసిన స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. అనంతరం వీరికి మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద స్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించి శేషవస్త్రంతో సత్కరించి వేదపండితుల ఆశీర్వచనాలను అందించారు. కార్యక్రమంల ఎసి మల్లికార్జున ప్రసాద్, ఈఈ నూకరత్నం,సూపరింటెండెంట్ నాగభూషణం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్ మరియు ఆలయాధికారులు పాల్గొన్నారు.

## నగరిలో గాలి భానుప్రకాష్ గెలుపు ఒక చారిత్రాత్మకం

పుత్తూరురూరల్, జూలై 14 ప్రభాతవార్త:



నగరిలో భారీ మెజారిటీతో గాలి భానుప్రకాష్ గెలుపొందడంతో పుత్తూరు మున్సిపాలిటీ 1వ వార్డు కట్టకింద రామకృష్ణాపురం గ్రామంలో జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా గ్రామదేవత గంగమ్మకు పొంగళ్ల పెట్టి, అంబలి పోసి రెండు మేకపోతులను బలిదానం చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, జిల్లా టీఎన్‌టీయూసీ కార్యదర్శి పందారాం మణి, పుత్తూరు పట్టణ బీసీసెల్ ఉపాధ్యక్షుడు సంతోష్, వార్డు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చొక్కా లింగారెడ్డి, అర్జున్‌రెడ్డి, మహేష్, నారాయణ, సుబ్రహ్మణ్యంరెడ్డి, గోవిందస్వామి రెడ్డి, ఉమాపతి, మణిరెడ్డి, అర్జున్‌రెడ్డి, లోకేష్, దేవేంద్రన్, మహేష్, చిరంజీవి, మురుగేష్‌రెడ్డి, గణేష్, బొబ్బిలి, మునిరత్నం, నాగరాజు, ప్రకాష్‌రాజు, చిరంజీవి, బలరాంరెడ్డి, రత్నంరెడ్డి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బురదమయంగా గ్రామీణ రోడ్లు

విజయపురం, జూలై 14 ప్రభాతవార్త:



మండలంలోని గ్రామాల్లో రోడ్లు బురదమయంగా మారింది. తేలికపాటి వర్షం కురిసినా రోడ్లు బురదమయంగా మారుతున్నదని, నడవడానికి సైతం ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తూతూ మంత్రంగా మట్టి చల్లడం వలన బురద తీవ్రత ఎక్కువై వాహనాలు కదలడం లేదని వాపోతున్నారు. మండలంలో శ్రీహరిపురం నుంచి లక్ష్మీవిలాసపురం రోడ్డు, ముత్యాలరెడ్డి కండ్రిగ నుంచి వరదరాజులు కండ్రిగ రోడ్డు, ఎం అగరం నుంచి చివ్వాడ రోడ్డు, నగరి రోడ్డు నుంచి సామిరెడ్డి కండ్రిగ రోడ్డు తిరుత్తణి రోడ్డు నుంచి గాండ్ల కండ్రిగ రోడ్డు బురదమయంగా ఉందని అధికారులు స్పందించి రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

## హజరత్ సయ్యద్ దర్గాను దర్శించుకున్న రిషితారెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 14 ప్రభాతవార్త



మొహరం(పీర్ల పండుగ) సందర్భంగా దర్గామిట్ట వెలసిన దర్గా మిట్టలో ఉన్న జుంలేపీర్‌బాబా దర్గాను ఎంఎల్‌ఏ బొజ్జలసుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జలరిషితారెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆమెకు దర్గా నిర్వాహకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్గాలో బాబా సమాధిని దర్శించుకుని చాదర్‌ను సమర్పించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ నిర్వాహకులు, కమిటీ సభ్యులతో పాటు తెదేపా నాయకులు షాకిరాలీ, పోలూరుశ్రీనివాసులురెడ్డి, తెదేపా రాష్ట్ర మహిళా నాయకురాలు రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆదేశాల మేరకు దాహార్తి తీర్చిన రిషితారెడ్డి

రేణిగుంట, జూలై 14 ప్రభాతవార్త:



ఎన్నికల ప్రచారంలో రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీలోని అల్లిమిట్ట, అన్నా స్వామి పల్లె గ్రామస్తులకు తాగునీటి సమస్య తీరుస్తానని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఇచ్చిన మాటను ఆయన ఆదేశాల మేరకు బొజ్జల రిషితారెడ్డి ఆదివారం రెండు బోర్లను ప్రారంభించి ప్రజలకు తాగునీటి సమస్యను తీర్చారు. ఎన్నికల ప్రచారంలో గ్రామస్తులు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల్లో గెలిచిన వెంటనే తాగునటి సమస్యను పరిష్కరిస్తానని గ్రామస్తులకు సుధీర్‌రెడ్డి మాట ఇచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో రెండు బోర్లు వేయించారు. వీటిని సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి ప్రారంభించారు. గ్రామస్తులు ఆనందంతో ఎమ్మెల్యేకి ఆయన సతీమణికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రేణిగుంట మండల టీడీపీ అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టీడీపీ సీనియర్ నేతలు డి.పుష్పనాథం, ముచ్చేలి భాస్కర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు నాధమునిరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఏ దంపతులకు ఆశీర్వచనాలు: సన్మానాలు

శ్రీకాళహస్తి,జూలై 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని కైలాసగింరి పర్వత పంక్తుల్లో శ్రీ శుకబ్రహ్మాశ్రమంచే నిర్వహించబడుతున్న వేద పాఠశాలతో నాలుగు రోజుల పాటు నిర్వహించిన దక్షిణ భారతదేశ వేదపండితుల, విద్యార్థులకు జనార్ధనానంద సరస్వ తతి ఆశ్రమం నిర్వహించిన 15వ వార్షిక మహాసభలకు ముఖ్యఅతిథిగా శ్రీకాళహసినత శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి దంపతులు హాజరయ్యారు. ఇక్కడ నాలుగు రోజుల పాటు దక్షిణ భారత దేశంలో వేదపండితులు హాజరయ్యారు. నాలుగు వేదాలకు సంబంధించి విస్తృత స్థాయిలో చర్చలు, సమావేశాలు జరిగాయి.ఆదివారం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సభలో బొజ్జల సుదీర్‌రెడ్డి దంపతులను నాలుగువేదాలకు సంబంధించి పండితులతో పాటు జనార్ధనానంద సరస్వతి ట్రస్టు అధ్యక్షులు సాయినాధ్‌శర్మ, కార్యదర్శి బ్రహ్మానంద శర్మ, శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారి ఎన్‌వియస్‌ఎన్ మూర్తి,రాయలసీమ వేదపండితుల ప్రతినిధి మారుతీశర్మ, శ్రీకాళహస్తికి చెందిన సీనియర్ వేదపండితులు చంద్రశేఖర్ శాస్త్రిల పర్యవేక్షణలో ప్రత్యేకంగా ఆశీర్వదించారు. అలాగే వారిని సభావేదిక పై ప్రత్యేకంగా సన్మానించారు. దుశ్శాలువలతో ముంచెత్తారు. వారికి శాసనసభ్యుడు ధన్యవాదాలు తెలిపారు.

## 17న మలయాళస్వామి రచన ఆవిష్కరణ

శ్రీకాళహస్తి,జూలై 14 ప్రభాతవార్త



ఏర్పేడు వ్యాసాశ్రమ వ్యవస్థాపకులు సద్గురు మళయాళ స్వామి రచించిన గ్రంధాలను పునర్ ముద్రణ జరిపి ఈ నెల 17న ఆవిష్కరించుటకు సన్నాహాలు జరుగుతున్నాయి.బుధవారం తొలిఏకాదశి సందర్భంగా మలయాళ సద్గురు 1919లో రచించిన పుస్తకాలను తిరిగి ముద్రించినట్లు తెలిసింది. ఆయన నాడు రచించిన సమరసత నేటి కాలానికి ఎలా సరిపోతుందనే అంశాలను భావి తరాలకు అందించుటకు పునర్ ముద్రించినట్లు తెలిసింది.ఈ పుస్తకావిష్కరణ ఈ నెల 17 మధ్యాహ్నం 3గంటలకు ఏర్పేడు వ్యాసాశ్రమంలో ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమాలను సామాజిక సరరసత వేదిక చేపట్టింది. వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజూరు బాలసుబ్రమణ్యం,శ్రీకాళహస్తి అధ్యక్షులు వీరాస్వామి, కార్యదర్శి ఈశ్వరయ్య,శంకరయ్య,ఎస్ సుబ్బరామిరెడ్డి, చిలకా రంగయ్య తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు.

## చటర్జీ నగర్ సమస్యలపై బొల్లినేని స్పందన

శ్రీకాళహస్తిరూరల్,జూలై 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి పంచాయతీలోని చటర్జీ నగర్ సమస్యల పరిష్కారానికి మాజీ సర్పంచ్ ప్రముఖ వ్యాపారవేత్త, నిత్యాన్నదాత బొల్లినేని జగన్నాధం నాయుడు స్పందిస్తున్నారు. ఆయన అధికారంలో లేక పోయినా సామాజిక బాధ్యతగా తమ గ్రామాన్ని బాగు చేసుకోవాలనే తపనతో ముందుకు వెళుతున్నారు. గ్రామానికి దారి ఏర్పాటు చేసిన ఆయన శ్మశానానికి దారిని ఏర్పాటు చేసారు. ఆదివారం పంచాయతీలోని చటర్జీ నగర్‌లో మురుగునీటి సమస్య పరిష్కారానికి పూనుకున్నారు. ఇక్కడ చక్కగా డ్రైనేజ్ వ్యవస్థ ఉండేది. సిమెంటు పైపులతో మురుగునీటిని మళ్ళించుటకు ఏర్పాట్లు చేసారు. అయితే అవి మట్టితో నిండిపోవటంతో మురుగునీరు బయటకు వచ్చి దారి మురుగుమయమైంది. ఈ దుస్థితిని గమనించిన బొల్లినేని జగన్నాధం నాయుడు స్పందించారు. ప్రత్యేక జెసిబిలు ఏర్పాటు చేసి పైపుల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించారు. ప్రస్తుతం వాతావరణం మారుతున్న దృష్ట్యా గ్రామాల్లో అతిసారం పెరిగే అవకాశం ఉందని కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు నిచ్చారు.

## ఘనంగా మాజీ ట్రస్టుబోర్డు పుట్టినరోజు వేడుకలు

శ్రీకాళహస్తి, జూలై 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు, తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకుడు వాకచర్ల గుర్రప్పశెట్టి 62 పుట్టినరోజు సందర్భంగా తెలుగుయువత అధ్యక్షుడు వంకాయల సిద్దులయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని ముత్యాలమ్మ గుడివీధిలోని ఆయన నివాసంలో గుర్రప్పశెట్టిని కలసి దుశ్శాలువ, పూలమాలతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా పార్టీ యువత నాయకుడు వంకాయల సిద్దులయ్య మాట్లాడుతూ పార్టీలో సీనియర్ నాయకులుగా ఉంటూ పార్టీ సిద్దాంతాలకు కట్టుబడి పనిచేస్తూ పార్టీ కార్యాలయంలో ఏపనిచేసినా ముందుదే వ్యక్తి గుర్రప్పశెట్టి ఒక్కరే అన్నారు.అనంతరం కేక్‌కట్‌చేసిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు కాసరం రమేష్, జిలానీ, మాజీ టౌన్‌బ్యాంకు ఛైర్మన్ డి.వి.నారాయణ, కొట్టే అనిల్, సంజాకులమురళీ, ఖాదర్‌బాషా, కళత్తూరు ఆర్ముగం,అబ్దుల్‌కరీం,, సుబ్రమణ్యం, మహేష్, ప్రకాష్, రాజేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జిపిఎస్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలి..ఎస్‌టియు

తొట్టంబేడు, జూలై 14 ప్రభాతవార్త



గత ప్రభుత్వం సిపిఎస్‌ను ఉద్దచేస్తామని మాట తప్పారని, సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్‌టియు తిరుపతి జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుమ్మడిమురళీ ఒప్రకటనలో తెలిపారు. గత ఐదు సంవత్సరాలుగా నిర్లక్ష్యం చేయబడిన వివిధ విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయులకు బోధనేతర పనులైన యాప్‌ల భారం తప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇప్పించి ప్రతి ఉన్నత పాఠశాలకు మరియు మండల విద్యాశాఖ కార్యాలయాలకు నియుక్తులు చేయాలని, మూడు నెలలుగా జీతాలురాని సమగ్ర శిక్ష సిఆర్పీలకు, ఉద్యోగులకు మరియు పాఠశాలమధ్యాహ్న భోజన కార్మికులకు సత్వరం జీతాలు అందించాలని కోరారు.

## ఎంజిఎం ఆస్పత్రిలో ఆర్‌ఎంపి డాక్టర్ల ఆత్మీయ సమావేశం

శ్రీకాళహస్తి, జూలై 14 ప్రభాతవార్త



పట్టణంలోని బసవయ్యపాలెం-నాయుడుపేట రోడ్డులో ఉన్న ఎంజిఎం ఆస్పత్రిలో ఉన్న ఎంజిఎం ఆస్పత్రిలో ఆదివారం శ్రీకాళహస్తి మరియు చుట్టుపక్కల ప్రాంతాల ఆర్‌ఎంపి డాక్టర్ల ఆత్మీయ సమ్మేళనంను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంజిఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్ హజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్య శ్రేయస్సు కోరి వైద్యసేవలు అందిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఎంజిఎం ఆస్పత్రిలో కూడా 24గంటల సేవలు అందుబాటులో ఉంటాయని వైద్యులు కూడా అందుబాటులో ఉంటారన్నారు. అతి తక్కువ ఖర్చుతో పూర్తి కార్పొరేట్ వైద్యం శ్రీకాళహస్తి మరియు పరిసర ప్రాంత ప్రజలకు అందించాలన్న సదుద్దేశంతో ఎంజిఎం ఆస్పత్రి స్థాపించామన్నారు. ప్రతి ఏడాది ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు జరుపుకుంటూ అందరూ కలసి సహృద్భావంతో ప్రజలకు వైద్యసేవలు అందించాలని తవలిపారు. అలాగే ఆర్‌ఎంపి డాక్టర్‌ల బృందం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఏర్పాటు చేస్తున్న ఎంజిఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సుమారు 100మంది ఆర్‌ఎంపి వైద్యులు మరియు ఎంజిఎం ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## బాటగంగమ్మ ఆలయం వద్ద కూలిన చెట్టు

తిరుమల, జూలై 14 ప్రభాతవార్త:



శనివారంరాత్రి కురిసిన భారీ వర్షానికి రింగురోడ్డులోని బాటగంగమ్మ ఆలయం వద్ద భారీ చెట్టు నేలకొరిగింది. రోడ్డుకడ్డంగా పడటంతో ఆదివారం ఉదయం వరకు అలాగే వదిలేశారు. చెట్టును తొలగించకపోవడంతో మధ్యాహ్నం వరకు వాహ నాల పార్కింగ్‌కు భక్తులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం తరువాత చెట్టును టిటిడి అటవీశాఖ తొలగించడంతో భక్తుల వాహనాలు తీశారు.

## పోలీసు సంక్షేమసంఘం ఔదార్యం

-ఏఎస్ఐ రెడ్డప్పనాయక్ కుటుంబానికి ఆర్థికసాయం

తిరుపతిటౌన్, జూలై 14ప్రభాతవార్త:



సహజంగా విధుల్లో ఉన్న పోలీసులు మృతి చెందితే ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందడం అంతంతమాత్రమే. అలాంటిది ఏఎస్ఐ రెడ్డప్పనాయక్ మృతి చెందడంతో ఆయనకుటుంబానికి పిఎస్‌పి ద్వారా 75లక్షలు రూపాయలు ఆర్థికసాయం అందించేలా పోలీసు అధికారుల సంక్షేమ సంఘంఅధ్యక్షుడు సోమశేఖరరెడ్డి కృషి చేశారు. అన్నమయ్యజిల్లా పెద్దమండ్యం పోలీసుస్టేషన్‌లోఏఎస్ఐ రెడ్డప్పనాయక్ గత మార్చిలో విధి నిర్వహణలో రోడ్డుప్రమాదంలోమృతి చెందాడు.వరంగల్ ట్రైనీ బ్యాచ్‌మేట్స్ ద్వారా తిరుపతి జిల్లాపోలీసు అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి సహకారంతో ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో ప్రాణాలు కోల్పోవడంతో ఎస్‌బిఐ పోలీసుశాలరీ ప్యాకేజీ ద్వారా 75లక్షలు రూపాయలు బీమా అందించేలా చూశారు. పిఎస్‌పి క్లయిమ్ ద్వారా పోలీసు శాలరీ ప్యాకేజీలో ఈ ఆర్థికసాయం అందించడంతో ఆ కుటుంబం సోమశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సభలో "ఎంఎల్‌ఏ"

మీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

చిత్తశుద్ధితో చంద్రగిరి సమగ్ర అభివృద్ధికి కృషి

ఎంఎల్ పులివర్తి నాని పునరుద్ఘాటన



చంద్రగిరి, జూలై 14 ప్రభాతవార్త:

చంద్రగిరి మండల విశ్రాంతి ఉద్యోగుల ఆత్మీయ సభకు ఎంఎల్‌ఏ పులివర్తి నాని ముఖ్య అతిథిగా విచ్చేశారు. మాజీ మిలిటరీ, రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు తమ సమస్యలను ఎంఎల్‌ఏ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించుకునేందుకు ఆత్మీయ సభకు ఎంఎల్‌ఏని ఆహ్వానించారు. స్థానిక కొత్తపేటలోని విశ్రాంత ఉద్యోగుల భవనం వద్ద ఆదివారం మేళతాళాలు మంగళ వాయిద్యాలతో పూలవర్షం కురిపిస్తూ తమ అతిధికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై తాను ప్రత్యేక చొరవతీసుకుని పక్షం రోజుల్లో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. చంద్రగిరి పంచాయతీ సమగ్ర అభివృద్ధికి తాను కట్టుబడి వున్నట్లు తెలిపారు. చంద్రగిరిలో టిడిపి కార్యకర్తల అకాల మరణంతో శ్మశాన వాటికను చూసినట్లు తెలిపారు. చంద్రగిరి ప్రజల కోసం గోవిందధామం నిర్మించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. మరో పది రోజుల్లో స్థలాన్ని పరిశీలించి, శుభ్రం చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు అధ్వాన్నంగా తయారు కావడంతో ఎంఎల్‌ఏగా మొదటి ప్రాధాన్యత క్రింద రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా చంద్రగిరి బైపాస్ నుండి శ్రీనివాసం మంగాపురం వరకు 80 అడుగుల నుండి 100 అడుగుల వెడల్పుతో విస్తరింపజేయనున్నట్లు తెలిపారు. శ్రీనివాస మంగాపురం మార్గంలో దాదాపు 5 ఎకరాల మఠం భూముల్లో ప్రజల సౌకర్యార్ధం కళ్యాణ మండపం, భక్తుల కోసం వెయిటింగ్ హాల్స్ వంటివి టిటిడి సహకారంతో నిర్మించనున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా అభివృద్ధికి అందరూ సహకరించాలనీ, కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు వుంటాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో వుంటానన్నారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులు ఎంఎల్‌ఏని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగు సుధ, పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, కొండూరు ప్రవీణ్ రాయల్, ఏజి పల్లి బాల, సక్కుర్ ధనంజయ రెడ్డి, పులికంటి మోహన్ రెడ్డి, రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, శానంబట్ల తులసిరెడ్డి, వీరంగారి రమేష్ రెడ్డి, గౌస్‌భాషా, మునిరత్నం రాయల్, విశ్రాంత ఉద్యోగుల సంఘం నరశింహారెడ్డి, వెంకట్రామిరెడ్డి, జనార్ధన్ రెడ్డి, పట్టాభి, నరశింహచ్చారి, చిరంజీవులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## నారా చిన్నబ్బ నాయుడుకు పులివర్తి నాని నివాళి

చంద్రగిరి, జూలై 14 ప్రభాతవార్త:



నారావారిపల్లికి చెందిన నారా చిన్నబ్బ నాయుడు అలియాస్ నారా ప్రభాకర్ నాయుడు చిత్రపటానికి ఎంఎల్‌ఏ పులివర్తి నాని పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. టిడిపి సీనియర్ నాయకుడు నారా చిన్నబ్బ నాయుడు దశదిన కర్మక్రియలు ఆదివారం నారావారిపల్లిలో జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఎల్‌ఏ, చిన్నబ్బ నాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నబ్బ నాయుడు మృతి తెలుగుదేశం పార్టీకి తీరనిలోటన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్ధించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ఏజి పల్లి బాల, గౌస్‌భాషా, లోకాద్రి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పరపల్లి మాతమ్మకు సారె సమర్పించిన దొడ్ల కరుణాకర్‌రెడ్డి

తిరుపతిరూరల్, జూలై 14 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ ఉప్పరపల్లిలో మాతమ్మ తిరునాళ్ళు ఘనంగా నిర్వహి స్తున్నారు. మాతమ్మ తిరునాళ్ళను పుర స్కరించుకుని ఆదివారం టిడిపి ప్రచార కార్యధర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి సారె సమర్పించారు. అనంతరం మాతమ్మకు ప్రత్యేక పూజలు చేసారు. గ్రామ ప్రజలు ఆయు:ఆరోగ్యాలతో ఉండాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని గ్రామదేవతను వేడుకున్నట్లు తెలిపారు. ఉప్పరపల్లి గ్రామంలో అంటురోగాలు ప్రబలకుండా చూడాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చంగల్‌రామానాయుడు, రాజా రాయల్, రేవంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, చెంచుశేఖర్, సురేష్, ఉమాపతి, నవీన్, అయ్యప్ప, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## 19న తాత్కాలిక అంగళ్ళకు వేలం పాటు

పుత్తూరురూరల్, జూలై 14 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి దేవస్థానంలో ఆగస్టు 11వ తేదీ నుంచి 28 వరకు జరగనున్న ద్రౌపదీదేవి తిరునాళ్ళ బ్రహ్మోత్సవాల సందర్భంగా తోపు ఆవరణంలో తాత్కాలిక అంగళ్ల కోసం ఈ నెల 19 తేదీ నుంచి శుక్రవారం ఉదయం 10 గంటలకి లక్కీడీప్ పద్ధతిని వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఈ వేలం లక్కీ డీప్ ద్వారా తీయబడునని వేలం మొత్తం రూ.10 లక్షలు నిర్ధారించామన్నారు. ఈ వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా డిపాజిట్ 25 వేలు చెల్లించి లక్కీ డీప్‌లో పాల్గొనవచ్చునని తెలిపారు. డీప్‌లోపేరు వచ్చిన వారిని మినహాయించి మిగతా వారు కట్టిన డిపాజిట్‌ను వాపసు ఇవ్వబడదన్నారు. లక్కీ డీప్‌లోపేరు వచ్చిన వారు ఆలయం వారి వద్ద వెంటనే మొత్తం పైకం వెంటనే చెల్లించి రసీదు పొందాలన్నారు.

# ఆ ఊరు వలస వెళ్లింది!

## - గుడికొత్తూరులో ఘనంగా వలస దేవర !!



గ్రామ హద్దుల్లో కంపలు వేసిన దృశ్యం, పక్కన అమ్మవారు

కుప్పం, జూలై 14 ప్రభాతవార్త

ఉదయం కోడికూత మొదలు.. గ్రామంలో ఉన్న పిల్లా..జెల్లా ..ముసలీ..ముతకా.. అందరూ తమ తమ ఇళ్లకు తాళాలు వేసుకుని, గ్రామంలో ఎవరూ ప్రవేశించకుండా ముళ్ల కంపలు అడ్డువేసి గ్రామానికి దూరంగా ఓ రోజు ఉండాలని నిర్ణయించుకున్నారు. అందుకు గ్రామస్తులు అందరూ అంగీకరించడంతో ఆదివారం గ్రామ గ్రామం మొత్తం ఏకమై పశుపక్ష్యాదులతో సహ తమ కుటుంబాలను వెంట తీసుకుని ఊరి పొలిమేరకు చేరారు. అనాదిగా వస్తున్న సంప్రదాయాన్ని ఈతరం వారు కూడా కొనసాగించారు. జీవనోపాధి కోసం ఎక్కడెక్కడో స్థిరపడిన గ్రామస్తులంతా ఒక్కచోటికి చేరుకున్నారు. పదేళ్ల అనంతరం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.గ్రామానికి ఎలాంటి అరిష్టాలు జరగకుండా అమ్మవారు సల్లంగా చూడాలని కోరుకుంటూ శ్రీ గంగమ్మ తల్లి అమ్మవారికి గ్రామస్తులంతా ప్రత్యేకంగా పూజలు జరిపారు. అమ్మా .. తల్లి ..గంగమ్మా మా ఊరిని చల్లగా సూడమ్మా.. అందరికీ మంచి ఆయురారోగ్యాలు ప్రసాదించు తల్లీ.. అంటూ మొక్కుకున్నారు. ఈసందర్భంగా అమ్మవారికి పూజల అనంతరం అందరూ కలసి అమ్మవారికి జంతుబలులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరి పొలి మేరల్లో పచ్చటి వనాల మధ్య అందరూ కలసి సంతోషంగా సామూహిక వన భోజన కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. బయటి ప్రాంతాలనుంచి వచ్చిన గ్రామస్తుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాయంత్రం ఆరు గంటలు దాటాక గ్రామస్తులంతా మరలా ఏకమై తమ ఊరిలోని ఇళ్లకు చేరుకున్నారు. ఈసందర్భంగా రాత్రి ఏడు గంటల ప్రాంతంలో కుప్పం - కెజిఎఫ్ రహదారి మొత్తం ట్రాఫిక్‌తో నిండిపోయింది.

# ఆర్ఎంపీ డాక్టర్ వైద్యం..అనంతలోకాలకు పయనం..!

## భర్త ఆదేశాలతో.. ఇంజక్షన్ వేసిన భార్య.. గాలిలోకి కలిసిన ప్రాణం
## మండలంలో ఆలస్యంగా వెలుగు చూసిన వైనం

గంగవరం, జూలై 14, ప్రభాతవార్త :

ఓ ఆర్ఎంపీ వైద్యుడు,అతని భార్య నిర్లక్ష్యంతో చికిత్స నిమిత్తం తన వద్దకు వచ్చిన ఓ దళిత నిరుపేదకు వైద్యం వికటించి అతని ప్రాణ వాయువు క్షణాల్లో గాలిలోకి కలిసిన విషాధకర సంఘటన మండలంలోని కలగటూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు న్యాయం కోసం ఆదివారం గంగవరం పోలీసులను ఆశ్రయించారు.బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా..మండలంలోని తాళ్ళపల్లె పంచాయతీ ఏదూరు గ్రామానికి చెందిన గోవిందప్ప(55) సుమారు 15 రోజుల క్రితం తల తిరుగుతుందని తన కుమారునితో కలిసి కలగటూరు పంచాయతీ అరసనపల్లె గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుడు గోపాల్‌రెడ్డి వద్దకు చికిత్స నిమిత్తం వెళ్ళాడు.ఈ నేపథ్యంలో గోవిందప్పకు సదరు ఆర్ఎంపీ వైద్యుడు తన భార్య ప్రమీలమ్మను ఓ ఇంజక్షన్ వేయాల్సిందిగా ఆదేశించాడు.దీంతో ఆమె ఇంజక్షన్ వేసిన వెంటనే గోవిందప్పకు ఒళ్ళంతా చెమటలు పట్టి వైద్యం వికటించి ఒక్కసారిగా కుప్పకూలాడు.దీంతో తన కుమారుడు వెంటనే కుప్పకూలిపోయిన తండ్రిని స్థానికుల సాయంతో ఓ ఆటోలో తీసుకొని పలమనేరు





మృతుడు గోవిందప్ప (ఫైల్‌ఫోటో), ఓ చిత్తు కాగితంపై వైద్యుడు రాసిన మందులు

ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడి వైద్యులు గోవిదప్పను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్థారించారు.విషయం తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు వైద్యం చేసిన ఆర్ఎంపీ వైద్యుడు గోపాల్‌రెడ్డి,ప్రమీలమ్మను మీ నిర్లక్ష్యవైఖరి కారణంగానే మా కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయామంటూ నిలదీశారు.దీంతో సదరు ఆర్ఎంపీ వైద్యుడు,అతని భార్య మేము కావాలని చేయలేదని ఏదో పొరబాటు జరిగిందని ప్రాధేయపడ్డారు. ముందుగా మీరు జరగాల్సిన దహనక్రియల కార్యక్రమం చూడండి తరువాత మాట్లాడుకొని మీకు న్యాయం చేస్తామని సదరు దంపతులు అదే గ్రామానికి చెందిన కొందరు పెద్ద మనసుల సమక్షంలో బాధితులకు నచ్చచెప్పి మృతుని కుటుంబ సభ్యులను,గ్రామస్తులను ఒప్పించారు.ఈ సంఘటన జరిగి దాదాపు 15 రోజులు గడిచిన గోపాల్‌రెడ్డి,అతని భార్య ఏ మాత్రం ఖాతరు చేయలేదు.

ఈ విషయంపై మృతుని కుటుంబ సభ్యులు,గ్రామస్తులు సదరు ఆర్ఎంపీ వైద్యుడు,అతని భార్య మాది బలమైన సామాజిక వర్గమని,మాకు రాజకీయనాయకుల పలుకబడి ఉందని మీకు చేతనైతే కేసులు పెట్టుకోండి, మేము చూసుకుంటాము అంటూ అవహేళనగా మాట్లాడడంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో బాధిత దళితులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు.అలాగే సదరు ఆర్ఎంపీ వైద్యుడి రిజిస్ట్రేషన్ రద్దు పరిచి అతనిపై,అతని భార్యపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టరుకు, జిల్లా వైద్యాధికారికి, ఎస్పీకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు.

# పల్లెల్లో లోపించిన పారిశుద్ధ్యం

## గ్రామాల్లో తాగునీరు కలుషితం
## అనారోగ్య బారిన పడుతున్న గ్రామస్తులు



మురికి నీటిలో ఉన్న కుళాయి

వెంకటగిరి రూరల్, జూలై 14,ప్రభాతవార్త:

గత రెండు రోజులుగా కురిసిన వర్షాలు కారణంగా పల్లెల్లో పారిశుద్ధ్యం మరింత దారుణంగా మారిందని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకటగిరి మండలంలోని సోమసానిగుంట పంచాయతీలోని ముగళ్ళగుంట,పాలకొండ సత్రంలో గ్రామంలో తాగునీరు పూర్తి స్థాయిలో కలుషితంగా మారి ప్రజలు వ్యాదులు బారిన పడుతున్నారని గ్రామస్తులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. దళితవాడలో పూర్తిగా డ్రైనేజి లేక పోవడంతో తాగునీరు కుళాయిలు చుట్టు మురికి నీరు చేరడం వల్ల తాగునీరు కలుషితంగా మారి పురుగులు వస్తున్నాయని, దీంతో గ్రామస్తులు రోగాలు బారిన పడి తీవ్ర అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు.సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అదేవిధంగా గ్రామంలో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించడంతో అంటువ్యాధులతోపాటు విష జ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు కలుషితం కాకుండా డ్రైనేజి ఏర్పాటు చేసే విధంగా చోరవ తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# గోంసంరక్షణ ట్రస్ట్‌కు రూ.1.85 లక్షలు విరాళం



కాణిపాకం, జూలై 14 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తుడు ఆదివారం 1.85 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు తిరుపతికి చెందిన సుబ్రమణ్యంరెడ్డి అనే భక్తుడు ఈపథకానికి 1.85 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని దాత కుటుంబసభ్యులతో చెక్ రూపంలో కలసి ఆలయ ఏఈఓ హరిమాధవరెడ్డికి అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పథకాలకు రూ.లక్ష విరాళం**

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలు జరుగుతున్న వివిధ అభివృద్ది పథకాలకు ఓ భక్తుడు ఆదివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు నెల్లూరుకు చెందిన పవన్ శ్రీనివాస్ అనే భక్తుడు నిత్యాన్న పథకానికి 50 లేల రూపాయలను, గోసంరక్షణ ట్రస్ట్‌కు 50 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్‌లకు అందజేశారు. ఈకార్యమంలో ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# గణనాధుని సన్నిధిలో రాష్ట్ర డీజీపి ద్వారకా తిరుమలరావు



కాణిపాకం, జూలై 14 ప్రభాతవార్త:

రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఆదివారం కుటుంబసమేతంగా సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన డీజీపీకి ఆలయం వెలుపల ముందుగా జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో పోలీసు అధికారులు పుష్పగుచ్చం అందించి ఘనస్వాగతం పలికారు. అలాగే రాజగోపురం వద్ద ఆలయ ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షియోషి బాబ్జేయి, చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు, అడిషన్ ఎస్పీ అరీపుల్లా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వరరావు,ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ విష్ణురఘువీర్, డీటీసీ డీఎస్పీ శ్రావణ్‌కుమార్, చిత్తూరు రూల్ సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్సైలు రామ్మోహన్, అనిల్‌కుమార్ ఆలయ సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా డీజీపీ రాక సందర్భంగా కాణిపాకంలో స్థానిక పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో బాంబ్‌స్కోడ్ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించారు.

# తిరుపతి జిల్లా డిపిఓ భవనానికి బడ్జెట్ కేటాయించండి

## -సిబ్బంది పదోన్నతులు కల్పించండి -డిజిపికి పోలీసు అసోసియేషన్ విజ్ఞప్తి



తిరుపతిటౌన్, జూలై 14ప్రభాతవార్త:

యాత్రాస్థలం,జిల్లాకేంద్రం తిరుపతిలో డిపిఓ భవనాలనిర్మాణానికి అవసరమైనబడ్జెట్ కేటాయింపులు చేయాలని, పోలీసుల పదోన్నతులు కల్పించాలని. స్టేషన్‌లలో పురుష,మహిళా కానిస్టేబుళ్ళకు ప్రత్యేక బ్యారక్‌లు ఏర్పాటు చేయాలని డిజిపి ద్వారకాతిరుమలరావుకు విజ్ఞప్తి చేశారు. పోలీసు అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కామరాజు తదితరులు డిజిపి ద్వారకతిరుమలరావునుకలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. తిరుపతి జిల్లాలో కొన్ని పోలీసుస్టేషన్‌లను అప్‌గ్రేడ్ చేయాలని, మంగళం, చెర్లోపల్లిలో పోలీసుస్టేషన్‌లు ఏర్పాటు అవసరమని, శ్రీకాళహస్తిలో ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటుచేసి పదోన్నతులు కల్పించాలని కోరారు. తిరుపతిలో యూనిట్ ఆస్పత్రి, సిపిసి క్యాంటీన్‌లకు భవనాలు మంజూరుచేయించాలని కోరారు. వీటిపై డిజిపి సానుకూలంగా స్పందించి తగిన రీతిలో అనుమతులు ఇస్తామని తెలిపారన్నారు.

# వెంకన్న ఆశీస్సులందుకున్నాం



తిరుమల, జూలై 14 ప్రభాతవార్త:

శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సు లందుకున్నామని ప్రముఖులు తెలిపారు. నగరి ఎమ్మెల్యే గాలిభానుప్రకాష్, బదిలీ అయిన సివిఎస్ఓ నరసింహకిశోర్, తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శనివారం వేకువజామున సుప్రభాతసేవలో స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు అందుకున్నారు .

# ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఘనంగా వీడ్కోలు



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీవారి ప్రతిమను అందజేస్తున్న జిల్లా కలెక్టర్

రేణిగుంట, జూలై 14 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్ ప్రసాద్‌కి రేణిగుంట విమానాశ్రయంలో ఆదివారం ఘనంగా వీడ్కోలు లభించింది. తిరుమల తిరుపతి పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం తిరుగు పయనమైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, టీటీడీ జేఈవో గౌతమి, జేసీ ధ్యానచంద్ర, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ తదితరులు వీడ్కోలు పలికారు. బయలుదేరడానికి ముందు కలెక్టర్ సీఎస్ దంపతులకు శ్రీవారి ప్రతిమను అందజేశారు.



# ఘనంగా వారాహి అమ్మవారి నవరాత్రుల వేడుకలు

వెంకటగిరి, జూలై 14, ప్రభాతవార్త

స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఘనంగా వారాహి అమ్మవారు నవరాత్రుల వేడుకలు నిర్వహించారు. వారాహి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసారు.

# సదాశివకోన ఖర్చుల్లో గోల్‌మాల్

## - ఈవోపై భక్తుల ఆగ్రహం



వడమాలపేట, జూలై 14 ప్రభాతవార్త:

ఎండోమెంట్ పరిధిలోని సదాశివకోనలో మహా శివరాత్రి ఖర్చుల్లో లక్షల రూపాయలు గోల్‌మాల్ జరిగినట్లు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం వడమాలపేటలో మహా శివరాత్రి సందర్భంగా జమాఖర్చులపై సమావేశం నిర్వహించారు. శివరాత్రి ముగిసిన వారం రోజుల లోపు బహిరంగ సమావేశం ద్వారా లెక్కలు చూపించాల్సి ఉంది. అయితే జమాఖర్చుల వివరాలపై నాలుగు నెలలుగా ఈవో తేల్చలేదు. దీంతో సదాశివుని భక్తులు శనివారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు ఆదివారం సమావేశం ఏర్పాటు చేసిన ఈవో రామచంద్రారెడ్డి జమాఖర్చులను చూపించారు. ఖర్చుల్లో పొంతన లేకపోవడం తేడాలు ఉండడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సదాశివేశ్వరునికి వచ్చిన ఆదాయాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. మార్చి నెలలో జరిగిన మహా శివరాత్రి ఉత్సవాల్లో హుండీ, దర్శన టికెట్లు తలనీలాల వేలం ద్వారా 13,29,638 రూపాయల మేరకు ఆదాయం వచ్చింది. ఖర్చులకు సంబంధించి 10,31,670 రూపాయలు మేరకు వ్యయం చేసినట్లుగా చూపట్టారు. దీంతో సుమారుగా ఐదు లక్షల రూపాయల మేరకు దేవుడి నిధులు దోచేశారని భక్తులు ఆరోపించారు. ఆలయ చైర్మన్ జయచంద్రన్ అనుమతితోనే వ్యయం చేసినట్లు ఈవో తెలిపారు. రెండేళ్లగా మన రాష్ట్రంతఓ పాటు తమిళనాడు, కర్ణాటక భక్తులు విరాళాల రూపంలో లక్షలాది రూపాయల మేరకు ఆభరణాలు కానుకలు ఇచ్చారని, దీనికి సంబంధించి దాతలకు ఎలాంటి రసీదులు ఇవ్వలేదని, ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో లెక్కలే లేవని, దేవుడి సొమ్మే కాజేస్తే క్షమించేది లేదని ఉన్నతాధికారులకు పూర్తి వివరాలతో ఫాక్స్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎండోమెంట్ కమిషనర్‌కు నేరులో కలసి ఫిర్యాదు చేస్తామని, రెండేళ్ళలో జరిగిన అక్రమాలపై విచారణ నిర్వహించేలా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని హెచ్చరించారు. సమావేశంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయలునాయుడు, పుత్తూరు, ఏర్పేడు, వడమాలపేట, సదాశివకోన, అన్నదాన సమాజం భక్తులు భాస్కర్‌నాయుడు, శ్రీధర్‌రాజు, సత్యనారాయణ, సంపత్తు, రమేష్, లక్ష్మయ్య, మురళి, శివరాయల్, హేమాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రికార్డు స్థాయిలో రాహుకేతు పూజలు

## స్వామి అమ్మవార్ల అభిషేకాలు ... సమాచార లోపంతో భక్తుల తిప్పలు

శ్రీకాళహస్తి,జూలై 14 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రికార్డు స్థాయిలో రాహుకేతు దోష నివారణ పూజలు, అభిషేకాలు జరిగాయి. అయితే దేవస్థానం భక్తుల నుంచి ఆదాయాలే మినహా వారి తిప్పలు పట్టడం లేదు. అధికారులు, ద్వితీయశ్రేణి అధికారులు భకక్తులు ఎదుర్కొం టున్న సమస్యలపై దృష్టిసారించటం లేదు. ఆలయానికి రాహుకేతుదోష నివారణ పూజల ద్వారా వచ్చే ఆదాయాలు అందులో వాటాలు తప్ప ఇక్కడకు వచ్చిన భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించటం లేదు. ఇక్కడ భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలు ఎవరికి మొరబెట్టుకోవాలనే సమాచారం కూడా లేదు. ఆదివారం వరుస సెలవులతో సుమారు పాతిక వేల మంది దర్శనం చేసుకున్నట్లు ప్రకటించారు. శనివారం సాయంత్రం నుంచి భక్తులు పోటెత్తారు... శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేని వర్షంతో వచ్చిన భక్తులు తల్లడిల్లారు. ఆదివారం ఉదయం నుంచి పట్టణంలోని తేరువీధిలో భక్తుల సునామిలా మారింది.ఓ వైపు వర్షం మరో వైపు భక్తుల తాకిడితో కిట కిట లాడింది.

**6వేల పూజలు: 130 అభిషేకాలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత పూజల్లో రాహుకేతుదోష నివారణ పూజలు ఒకటి ఈ పూజల ద్వారా ఆలయానికి విపరీతమైన ఆదాయాలు వస్తున్నాయి. ఆదివారం సాయంత్రం వరకు అందిన సమాచారం మేరకు రాహుకేతుదోష నివారణ పూజ 6వేలు జరిగినట్లు తెలిపారు. కాగా ఆదివారం కాబట్టి శనీశ్వరునికు 19 అభిషేకాలు జరిగాయి. ఇక స్వామి అమ్మవార్ల అభిషేకాలు 130 జరగగా సాయంత్రం నిర్వహించే మహా న్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషే కాలు 35 జరిగాయి. ఇక ప్రత్యేక దర్శన టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రవేశించిన వారు ఏనిమిది వేల మంది.ఆలయంలో దళారుల కట్టడితో ప్రత్యేక దర్శన టికెట్లు గణనీయంగా పెరుగుతున్నాయి.



పాదరక్షలను గుట్టగా పోసిన దృశ్యం

**సమాచార లోపం:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వస్తున్న భక్తుల పరిస్థితి సమాచార లోపంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా ఆలయానికి వచ్చే భక్తులు పాదరక్షలు నాలగవ గేటు నుంచి రోడ్డుపక్కన,అలాగే స్థపద మండపం వద్ద భక్తులు తమ పాదరక్షలను వదిలి పెట్టి వెళతారు. ఇక్కడ పాదరక్షలు భద్రపరచు లాకర్లు లేదు.మిగిలిన మూడు గేట్ల వద్ద కౌంటర్లు ఉన్నాయి.కానీ నాలుగవ గేటు వద్ద లేదు.అయితే ఇక్కడ వదిలిపెట్టిన పాదరక్షలను నాలగవ గేటు పార్కింగ్ వద్ద కుప్పలుపోసారు. దీంతో భక్తుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాల్సి ఉంది.